
# కేటలినా అయిలాండ్ ట్రావెలాగ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి



*(ప్రారంభం)*

**2018 ఆగస్ట్‌లో** అమెరికా వచ్చామని తెలియగానే ఎప్పట్లాగే శ్రీ కిరణ్‌ప్రభ, కాంతి దంపతులు తమ ఇంటికి రమ్మని సాదరంగా ఆహ్వానించారు.



"మీరు కేలిఫోర్నియా వెళ్తే, నేను కూడా మీతో వస్తాను. మిమ్మల్ని కేటలినా ఐలాండ్‌కి తీసుకెళ్తాను. నేనొకసారి వెళ్ళాను. మీతో చూడాలనిపించింది" మా చిన్నమ్మాయి లిపి చెప్పింది.

కొత్త ప్రాంతాలు చూడడమంటే మాకు ఆసక్తి కాబట్టి సరే అన్నాం. ఆ ప్రకారం లిపి మాకు కేలిఫోర్నియాకి టిక్కెట్స్ బుక్ చేసింది.

25-10-2018న ఇండియానా పోలిస్‌లోని మా రెండో అమ్మాయి ఊహ ఇంటినించి ఉదయం 6.10కి సౌత్ వెస్ట్ ఎయిర్‌లైన్స్ విమానంలో బయలుదేరి స్థానిక సమయం ఉదయం 7.00కి డెన్వర్‌లో దిగాం. మా ఫ్లైట్ నంబర్ 2792. మళ్ళీ డెన్వర్‌లో 8.20కి కనెక్టింగ్ ఫ్లైట్ 2207 ఎక్కి, స్థానిక సమయం ఉదయం 10.30కి ఓక్‌లేండ్ ఎయిర్‌పోర్ట్‌లో దిగాం. కాంతిగారు, ఆమె స్నేహితురాలు శ్రీలతగారు మమ్మల్ని ఎయిర్‌పోర్ట్‌లో రిసీవ్ చేసుకున్నారు. శ్రీలతగారు మమ్మల్ని కాంతిగారి ఇంట్లో దింపి ఆఫీస్‌కి వెళ్ళిపోయారు.



కిరణ్ ప్రభగారి ఇంటిముందు

కేటలినా ట్రిప్‌ని ప్లాన్ చేసిన మా లిపి 27-10-2018న ప్యుయోరియా (ఇల్లినోయ్) నించి డబ్లిన్‌లోని మా దగ్గరకి వచ్చింది. తను కేటలినా ఐలాండ్‌కి ప్రయాణ ఏర్పాట్లు చేసుకుని వచ్చింది. టిక్కెట్లు బుక్ చేసేముందు శ్రీ కిరణ్‌ప్రభ, కాంతిగార్లని కూడా మాతో రమ్మని ఆహ్వానించింది. కానీ ఆయనకి సెలవు లేకపోవడం, నవంబర్ కౌముది మాసపత్రిక విడుదల ఉండటంతో రాలేమని చెప్పారు.

### 30-10-2018 మంగళవారం డే -1

ఉదయం కిరణ్‌ప్రభగారి భార్య కాంతిగారు మాకు బ్రేక్‌ఫాస్ట్‌గా ఇడ్లీ చేసి పెట్టారు. చట్నీ, ఇడ్లీ ఒకదాన్ని మించి మరోటి రుచిగా ఉన్నాయి. 8.30కి లిపి ఎయిర్‌పోర్ట్‌కి ఊబర్ టేక్సీని బుక్ చేసింది. ట్రాఫిక్ ఎక్కువ ఉంటుందని ముందే బయలుదేరాం. వారి ఇంటి పక్కనే ఉన్న కల్-డి-సాక్ (డెడ్ ఎండ్ స్ట్రీట్)కి అది ఐదు నిమిషాల తర్వాత వచ్చేసరికి మేం అక్కడ

సిద్ధంగా ఉన్నాం. టేక్సీ డ్రైవర్ నల్లజాతి వ్యక్తి. నాతో మాటలు కలిపాడు. అతను ఆదాయం కోసం రాత్రుళ్ళు రెండో ఉద్యోగం కూడా చేస్తున్నాడని తెలిసి అతనికో సలహా చెప్పాను. అతనిలో కలుపుగోలుతనం, కొత్తవాళ్ళతో మాట్లాడే గుణం ఉంది కాబట్టి అనేకమంది గురించి తెలుసుకోవచ్చు ఎయిర్‌పోర్ట్‌నించి వస్తూంటే, ఎందుకు వస్తున్నారో తెలుసుకోవచ్చు. ప్రయాణీకుల నించి మానవీయ కోణాలు చాలా దొరుకుతాయని చెప్పాను. ప్రయాణీకులతో అనుభవాలని ఎప్పటికప్పుడు ఫోన్‌లో మర్చిపోకుండా రాసుకుని, (డిక్టేట్ చేస్తే టైపవుతుంది) కొంతకాలం తర్వాత ఆ మెటీరియల్‌తో టేక్సీ డ్రైవర్ అనుభవాలనే పుస్తకం రాయమని, అది అచ్చవుతున్నంతకాలం, కిండిల్‌లో ఉన్నంతకాలం రాయల్టీలు వస్తాయని చెప్పాను. అతను రాయలేకపోతే కొంత డబ్బు తీసుకుని రాసే రచయితల సహాయం తీసుకోమని కూడా సూచించాను. నా సలహా మీద అతనికి ఆసక్తి కలిగి చాలా ప్రశ్నలు వేసాడు. కానీ మరి నా సలహాని పాటిస్తున్నాడో లేదో?


సుమారు నలభై ఐదు నిమిషాల్లో ఎయిర్‌పోర్ట్‌కి చేరుకున్నాం. చెకిన్ లగేజ్ లేదు. ఉదయం 9.05కల్లా చెకిన్ ఐ సెక్యూరిటీ చెక్ ముగించుకుని డిపార్చర్ లాంజ్‌కి చేరుకున్నాం. 11.19కి ఓక్లాండ్ ఎయిర్‌పోర్ట్ నించి లాంగ్ బీచ్‌కి జె ట్ బ్లూ విమానంలో మా ప్రయాణం.


ఫెరీలోపల

ఫ్లైట్ నంబర్ బి -6147. అటు మూడు, ఇటు మూడు సీట్ల వరసలున్న ఆ విమానంలో మా సీట్ నంబరు 18 ఏ,బి,సి. మధ్యాహ్నం 12.40కి లాంగ్ బీచ్‌లో దిగాం. విమానంలో కాఫీ కూడా ఇవ్వలేదు.

లిపి ఎయిర్‌పోర్ట్ నించి సీపోర్ట్‌కి ఊబర్ని బుక్ చేసింది. 16 కిలోమీటర్ల దూరంలోని లాంగ్ బీచ్ పోర్ట్‌కి పావుగంటలో, అంటే 11.20కి చేరుకున్నాం. పోర్ట్‌కి వెళ్ళే దారిలో ఆయుర్వేదం, పామిస్ట్రీ, యోగ, హోలిస్టిక్ ఆకుపంక్చర్, హెర్బల్ మెడిసిన్ మొదలైన బోర్డులున్న షాప్స్ చాలా కనిపించాయి.


దాని పేరు పోర్ట్ ఆఫ్ లాంగ్ బీచ్. లాస్ ఏంజెలెస్ పోర్ట్ తర్వాత అది అమెరికాలో రెండో బిజీ కార్గో పోర్ట్. దానికి ఎనిమిది టెర్మినల్స్ ఉన్నాయి. ఇక్కడ నించి మెక్సికో, ప్యూర్టో వలెర్టా, కేబో, కవాయ్, ఏన్సనాడాలకి ఏడాదికి సగటున 300 క్రూజెస్ వెళ్తూంటాయి. లిపి ముందే వారి సైట్లోకి వెళ్ళి, లాంగ్ బీచ్ నించి కేటలినా ఐలాండ్‌కి వెళ్ళే కేటలినా ఎక్స్‌ప్రెస్ ఫెరీలో మా ముగ్గురికి టిక్కెట్లని బుక్ చేసింది. ఒన్ వే టిక్కెట్ 36.75 డాలర్లు. సీనియర్ సిటిజన్ని కాబట్టి నాకు 33.25 డాలర్లు. రిటర్న్ టిక్కెట్‌కి కూడా ఇదే ధర. మధ్యాహ్నం మూడు గంటలకి డిపార్చర్.




ఒకటిం ముప్పావుకి పోర్ట్‌లోని ఓ రెస్టొరెంట్‌లో గ్రిల్డ్ వెజ్ సేండ్‌విచ్, ఫ్రెంచ్ ఫ్రైస్, క్రొసాంట్స్, నీళ్ళ సీసాని కొన్నాం.

నేనిచ్చిన కేష్ తీసుకోకపోవడంతో లిపి తన డెబిట్ కార్డ్‌ని ఉపయోగించింది. అమెరికాలో కొన్నిచోట్ల నగదు తీసుకోరు. ఇండియాలో డాలర్లు తీసుకునేప్పుడు ఇరవై నోట్లు తీసుకోవడం మంచిది. రెండున్నరకి మా ఫెరీ చెకిన్‌కి ఎనౌన్స్‌మెంట్ వినబడగానే లైన్లో నించున్నాం.

ఓడ డిపార్చర్‌కి అరగంట ముందు చెకిన్ చెయ్యాలి. చెకిన్ పద్ధతి విమానాశ్రయంలోలానే. 23 కిలోల చెకిన్ సూట్‌కేస్‌లు రెండు, ఓ కేరీ ఆన్‌ని అనుమతిస్తారు. కానీ మేం ముగ్గురం రెండు కేరీ ఆన్‌లు మాత్రమే తెచ్చుకున్నాం. మన లగేజ్‌ని గుర్తుపట్టేందుకు వీలుగా సిబ్బంది ఇచ్చిన టేగ్స్‌ని దానికి కట్టివ్వాలి. సామానుని స్కేనింగ్ చేసాకే ఓడలోకి ఎక్కిస్తారు. ఫెరీ మొదట్లో షెల్ఫుల్లో ప్రయాణీకుల సైకిళ్ళు, స్క్యూబా గేర్ లాంటివి కనిపించాయి.



మా ఫెర్రీ కెపాసిటీ 450. మధ్యాహ్నం మూడుకి ఫెర్రీ బయలుదేరింది. కెప్టెన్ మైక్‌లో లైఫ్ జాకెట్లు ఎక్కడున్నాయో చెప్పి, అవి ఎలా తొడుక్కోవాలో చెప్తూంటే ఇద్దరు ఉద్యోగులు డిమాన్‌స్ట్రేషన్ చేసారు. ఇది అంతర్జాతీయ నిబంధన. బాగా గాలిగా ఉండటంతో మేము పై డెక్ మీదకి వెళ్ళలేదు. మా ఇద్దరికీ స్వల్పంగా కడుపులో తిప్పింది. అదృష్టవశాత్తు అంతటితో ఆగింది. రేవు దగ్గరకి పడ్డాక సముద్రానికి అటూ, ఇటూ ఎదురుగా అర్ధచంద్రాకారంలో కొండలు కనిపించాయి. మూడుంముప్పావుకి ఫెర్రీ కేటలినా ఐలాండ్ పోర్ట్‌లో ఆగింది. దిగగానే 'వెల్ కం టు అవలాన్' అనే బోర్డ్ కనిపించింది. ఓడ దిగి, పియర్ మీద నడిచి కేటలినా ద్వీపంలోని ప్రధాన భాగం ఎవలాన్‌కి చేరుకున్నాం. ఎవలాన్‌లో 'టు హార్బర్స్' అనే ఇంకో పోర్ట్ కూడా ఉంది.

**ఎవలాన్**

దీన్ని నేటివ్ అమెరికన్స్ పిముగ్నా లేక పిమూ అని పిలిచేవారు. వారిని పిమ్‌గన్స్ లేదా పిమువిట్ అనేవారు. 1602లో ఈ ద్వీపాన్ని స్పేనిష్ ఎక్స్‌ప్లోరర్స్ కనిపెట్టారు. ఆ రోజు సెయింట్ కేథరిన్ డే కాబట్టి దీనికి కేటలినా ఐలండ్ అనే పేరు పెట్టారు. ఇది పసిఫిక్ మహాసముద్రంలో, కేలిఫోర్నియా మెయిన్ లేండ్‌కి 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీని విస్తీర్ణం 194 చదరపు కిలోమీటర్లు. మొదట్లో ఈ ద్వీపాన్ని బంగారం కోసం తవ్వకాలకి, స్మగ్లింగ్‌కి, ఆటర్ (సముద్ర జంతువు) వేటకి ఉపయోగించారు. 1860లో టిమ్ అనే ఓ జర్మన్ వలసదారుడు ఇక్కడ గొర్రెల పెంపకం కూడా చేసాడు. అప్పట్లో దీన్ని టిమ్స్ లేండింగ్ అని పిలిచేవారు. అప్పుడే పర్యాటకం మొదలైంది. 1883లో టిమ్స్ లేండింగ్‌లో 30 గుడారాలు, 3 చెక్క గృహాలు ఉండేవి. 1887లో షాటో అనే డెవలపర్ దీన్ని రెండు లక్షల డాలర్లకి కొని ఎవలాన్ (బ్రైట్ జెమ్ ఆఫ్ ది ఓషన్ అని అర్థం) ఊరుని, శెలవలకి వచ్చి గడపడానికి వీలుగా పర్యాటకాన్ని అభివృద్ధి చేసాడు. పియర్‌ని, మొదటి హోటల్‌ని ఇతనే నిర్మించాడు. లార్డ్ టెన్నిసన్, కింగ్ ఆర్థర్ మీద రాసిన కవిత 'ఐడిల్స్ ఆఫ్ ది కింగ్' నించి ఎవలాన్ అనే పేరుని ఎంపిక చేసి అతనే పెట్టాడు. ఐతే అప్పు తీర్చలేకపోవడంతో ఇది దీన్ని అమ్మిన లిక్ ఎస్టేట్‌కి తిరిగి వెళ్ళిపోయింది. 1891లో జేమ్స్ లిక్ నించి బేనింగ్ బ్రదర్స్ దీన్ని శాంటా కేటలినా ఐలాండ్ కంపెనీ పేర కొని పర్యాటక రిసార్ట్‌గా అభివృద్ధి చేసారు. ఐతే 1915లో ఎవలాన్‌లోని సగభాగం అగ్నికి ఆహుతైంది. ఇప్పటికీ ఇక్కడ నిలిచి ఉన్న పురాతన కట్టడం హోలీ హిల్ బిల్డింగ్.



1919లో చూయింగ్ గమ్ మేగ్నెట్ విలియం రిగ్లీ జూనియర్, శాంటా కేటలినా ఐలాండ్ కంపెనీ నించి కొన్నాడు. అప్పటికి ఎవలాన్ విస్తీర్ణం ఒక చదరపు మైలు. రిగ్లీ జూనియర్ ద్వీపంలో అనేక పర్యాటక ఆకర్షణలని అభివృద్ధి చేసి, రోడ్లు కూడా వేసాడు. 1928లో కేటలినా కేసినో నిర్మాణాన్ని ఆరంభించి 18 నెలల్లో పూర్తి చేసాడు. దీనికో బాల్ రూం, సినిమా థియేటర్ కూడా ఉన్నాయి. మొదటినించి ఇక్కడి ఆదాయం పర్యాటకం వల్లే. 1921 - 1951 మధ్య విలియం రిగ్లీ జూనియర్ షికాగో కబ్స్ అనే బేస్‌బాల్ టీంకి

యజమాని. ఆ క్రీడాకారులని ఇక్కడికి శిక్షణ కోసం తీసుకువస్తూండేవాడు. 1932లో విలియం మరణించాక అతని కొడుకు ఫిలిప్ వారసుడయ్యాడు. అతను ఈ ద్వీపాన్ని మరింత అభివృద్ధి చేసాడు.

రెండో ప్రపంచ యుద్ధకాలంలో యు.ఎస్ మిలటరీ ఈ ద్వీపాన్ని ఆక్రమించుకుంది. ఈ ద్వీపంలోని ఓ ప్రాచీన బిల్డింగ్ సివిల్ వార్ బేరక్స్. 184లో యు.ఎస్. ఆర్మీ 83 మంది సైనికులని, స్థానిక రెడ్ ఇండియన్స్‌లోని ఉగ్రవాదుల రిజర్వేషన్ కాలనీగా సర్వే చేయడానికి ఇక్కడికి పంపింది. వారు ఇస్టుమస్ కోవ్, కేటలినా హార్బర్ మధ్యగల ఏరియాని అసెస్ వేసాక ఆ ద్వీపం ఇబ్బందికరమైన నేటివ్ అమెరికన్స్‌ని ఉంచడానికి మంచి ప్రాంతంగా భావించింది. కొన్ని కారణాలవల్ల ప్రభుత్వం చివరికి ఆ పథకాన్ని రద్దుచేసింది. కానీ ఆ సైనికుల కోసం నిర్మించిన బేరక్స్ సివిల్ వార్‌కి, రెండో ప్రపంచ యుద్ధానికి, హాలీవుడ్ మేజిక్‌కి జ్ఞాపక చిహ్నంగా మిగిలాయి.

1920 - 1930ల మధ్య హాలీవుడ్ సిబ్బంది ‘మ్యూటినీ అన్ ది బౌంటీ, ఓల్డ్ ఐరన్ సైడ్’ లాంటి సినిమాల షూటింగ్ సమయంలో ఈ పాత సివిల్ వార్ బేరక్స్‌ని ఇళ్ళుగా ఉపయోగించారు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో యు.ఎస్ ఆర్మీ మళ్ళీ ఈ బేరక్స్‌ని



తమ సైనికుల కోసం ఉపయోగించింది. యు.ఎస్ కోస్టల్ గార్డ్ కొత్త సైనికులకి శిక్షణా కేంద్రంగా ఈ బేరక్స్‌ని ఉపయోగించారు. 1951నించి ఈ బేరక్స్ ఇస్ట్‌మస్ యాట్ క్లబ్ నిర్వహణలో ఉన్నాయి.

1940 -1950 హాలీవుడ్ గోల్డెన్ ఏజ్‌లో సెలబ్రిటీలు ఇక్కడికి వచ్చి గడిపేవారు. బింగ్ క్రాస్బీ, హంఫ్రీ బోగర్ట్ లాంటి సెలబ్రిటీస్ ఇక్కడికి వస్తూండేవారు. బింగ్ క్రాస్బీ తన స్వంత పడవ షార్టీ -2లో మిత్రులతో ఇక్కడికి వస్తూండేవాడు.

ఈ ద్వీపంలో సినిమా షూటింగ్స్ కూడా బాగా జరిగేవి. 1920లలో ‘డి మిలీ మేల్ అండ్ ఫీమేల్’ అనే సినిమాని ఇక్కడే తీసాడు. 1881లో మొదటగా పర్యాటకుల కోసం చేపల పడవని ప్రయాణీకుల పడవగా మార్చారు. నేడు ఎనిమిది ఆధునిక ఫెర్రీలని మెయిన్ లాండ్‌కి నడుపుతున్నారు.



వాతావరణం ఎక్కువ చలి, ఎక్కువ వేడి లేకుండా చాలా ఆహ్లాదంగా ఉంది. కాలినడకన మా హోటల్ వైపు వీధుల్లో నడుస్తూంటే యూరప్‌లోని చిన్న గ్రామంలో నడిచినట్లుగా అనిపించింది. ఆర్కిటెక్చర్ అలా ఉంది. పాదాచారులకి ఎడమవైపు ఓ చిన్న రోడ్ ప్రత్యేకంగా ఉంది. వాహనాలు రాకుండా దాని మొదట్లో గొలుసొకటి అడ్డంగా కట్టి ఉంది. అనేక రెస్టారెంట్స్, ఐస్ క్రీం, సువెనీర్ షాపులు, మెక్సికన్ స్ట్రీట్ ఫుడ్ ఐన టేకోలు అమ్మే చిన్న దుకాణాలు, షాపులు రోడ్‌కి ఎడమవైపు, కుడివైపు వాహనాలకి రోడ్, సముద్రం అంచున నీళ్ళు ఊళ్ళోకి రాకుండా కట్టిన గోడ కనిపించాయి. ఆ రోడ్ మీద 4-6 మంది ప్రయాణించే చిన్న ఎలక్ట్రిక్ కార్ట్‌లు చాలా కనిపించాయి. మర్నాడే హాలోవీన్ డే కాబట్టి షాప్స్ బయట అస్థిపంజరాలు, దయ్యాలు, సముద్రపు దొంగలు, పాములులాంటి బొమ్మలతో అలంకరించారు. ఇక్కడ సీ ఫుడ్ అధికం. లాబ్‌స్టర్ ట్రాప్ అనే రెస్టారెంట్ బయట ‘లాబ్ స్టర్ లంచ్’ అనే బోర్డు ఉంది. బ్లూ రోజ్ రెస్టారెంట్ బయట ఫ్రెష్ ఫ్రం ది సీ’ అనే బోర్డుంది. ఓ బార్ పేరు ‘టు ఈజ్ ఏ కంపెనీ’. నేలమీద మట్టి కనపడదు. కాబట్టి దమ్ములేదు.



పావుగంట నడక తర్వాత మెయిన్ రోడ్‌కి ఎడమ వైపున్న వీధిలోని మేం బస చేసే 'ఇన్ హోటల్'కి చేరుకున్నాం. లిపి డ్రైవింగ్ లైసెన్స్ చూసాక క్లర్క్ మాకు రిజర్వ్ చేసిన గది తాళం చెవి ఇచ్చింది. రిసెప్షన్ గదిలో గాజు బౌల్స్‌లో ఆరు ఆకుపచ్చ ఏపిల్స్ కనిపించాయి. పక్కనే కాఫీ పెర్కొలేటర్, టీ కెటిల్, కాఫీ కప్స్, పేపర్ కప్స్, క్వేకర్స్ ఓట్ మీల్ పాకెట్స్, మినీ మఫిన్స్ అనేక రకాల స్కోన్, ఆరెంజ్ జూస్ ఉన్నాయి. వాటిని ఉచితంగా తీసుకోవచ్చు. వైఫై గురించి అడిగితే, హోటల్లో వైఫై ఉందని, ఆటోమేటిక్‌గా కనెక్ట్ అవుతుందని, పాస్‌వర్డ్ లేదని, టివిలో 83 ఛానల్స్ వస్తాయని రిసెప్షనిస్ట్ చెప్పింది.

"బ్రేక్‌ఫాస్ట్ ఉదయం తొమ్మిదినించి పదకొండు దాకా. చెకౌట్ ఉదయం పదకొండుకి. గది ఖాళీ చేసాక మీరు ఎటైనా వెళ్ళాలనుకుంటే లగేజ్‌ని ఇక్కడ వదిలి వెళ్ళచ్చు. పోర్ట్‌కి వెళ్ళేప్పుడు తీసుకోవచ్చు. రాత్రిళ్ళేమైనా అవసరం వస్తే నైట్ మేనేజర్ని కాంటాక్ట్ చేయండి" రిసెప్షనిస్ట్ చెప్పింది.

ముప్పై ఏళ్ళ క్రితం హోటల్లో దిగిన ప్రతీ ఇరవైనాలుగు గంటలకీ ఓ రోజు అద్దె చెల్లించేవారు. తర్వాత ఆదాయం పెంచుకోడానికి గది ఖాళీ చేసే టైంని మధ్యాహ్నం పన్నెండుగా నిర్ణయించారు. ఇందువల్ల ఉదయం ఏ ఆరుకో గది తీసుకుంటే మధ్యాహ్నం పన్నెండుకి ఓ రోజు పూర్తై మళ్ళీ కొత్త రోజు మొదలవడంతో ఇరవై నాలుగు గంటల్లో మర్నాడు ఉదయం ఆరుకి గది ఖాళీ చేసినా రెండు రోజుల అద్దె చెల్లించాల్సి ఉంటుంది. అమెరికాలో మొదలైన ఈ పద్ధతి ఇప్పుడు అన్ని చోట్లా వచ్చింది. ఇందువల్ల కొన్ని టూర్స్‌లో సామానుతో రిసెప్షన్‌లో వెయిట్ చేయాల్సి వచ్చింది. ఇటీవల పన్నెండుకి చెకౌట్ అయ్యాక మధ్యాహ్నం రెండుదాకా గదిని ఇవ్వడం లేదు. ఆ రెండు గంటలు గదిని శుభ్రం చేస్తారు.

నాలుగో అంతస్థులోని మా గది నంబర్ 40. లిఫ్ట్ లేదు. పెద్ద ఉన్న ఆ ఏసి గదిలో లిపి ముందే కోరిన ఓ డబుల్ బెడ్, ఓ సింగిల్ బెడ్ ఉన్నాయి. దివాన్ కూడా. చాలా ఏళ్ళ క్రితం కట్టిన బిల్డింగ్ అది. గది శుభ్రంగా ఉంది. కిటికీలోంచి వెనక ఇళ్ళ కప్పులు చాలా కనిపించాయి.

ఫ్రెష్ అయాక ముగ్గురం ఊరు చూడటానికి బయటికి వెళ్ళాం.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in
*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*